Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
19-02-2026

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 52 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM



తెలంగాణలో కాంగ్రెస్‌కు

## తిరుగులేదు

### 94 మునిసిపాలిటీల్లో విజయం సాధించాం

### మరో రెండు పర్యాయాలు మాదే అధికారం

### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, వచ్చే రెండు పర్యాయాలు కూడా పార్టీయే అధికారంలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు.స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉన్నదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 87.5 శాతం టికెట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని చాటుకుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, దాదాపు 67 శాతం బీసీ వార్డు మెంబర్లు కాంగ్రెస్ మద్దతు తోనే గెలిచారని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

టూప్ న్యూస్



అమెరికా-భారత్ మధ్య

### సబ్‌సీ కేబుల్ రూట్

- లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- అదానీ ఏఐతో చేతులు కలిపిన గూగుల్

02



అర్హులైన జర్నలిస్టులందరికీ

### అక్రిడిటేషన్లు

- ఆన్‌లైన్ లో దరఖాస్తుల స్వీకరణ.. ప్రత్యేక వెబ్ సైట్ ప్రారంభం
- ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి

02



### ఇబ్రహీంపట్నం ట్విస్ట్‌లు

- స్టే ఎత్తివేసిన హైకోర్టు.. ఎన్నిక బాధ్యత కలెక్టర్ దే
- ఖానాపూర్ లో మరో ట్విస్ట్

02

# గేమ్ ఛేంజర్ సీఎం రేవంత్

## బీసీలదే పట్టణం



పురపోరులో మహిళా ప్రభంజనం.. రిజర్వేషన్లకు మించి పదవులు

61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లు బీసీల కైవసం

పంచాయతీలో 52.75 శాతం సీట్లు గెలిచిన బీసీలు

సీఎం తీసుకొచ్చిన రిజర్వేషన్ల చైతన్యంతో రాష్ట్రమంతా మార్పు

బీసీలకు 42% రిజర్వేషన్లపై కేంద్రానికి అసెంబ్లీ తీర్మానం పంపిన సీఎం

(హైదరాబాద్ - మహా)

తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చేశారు. రిజర్వేషన్ అయినా కాకున్నా.. స్థానిక జనాభా ఆధారంగా ఏ రాజకీయపార్టీ అయినా బీసీలకు పట్టం కట్టే స్థాయి చైతన్యాన్ని ఈ ఎన్నికల్లో నింపారు. ఫలితంగా మునుపెన్నడూ లేని రీతిలో బీసీలకు అధికారంలో వాటా దక్కింది. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా మునిసిపాలిటీలలో 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లు గెలుచుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల కోసం చట్టసభల ద్వారా, న్యాయస్థానాల ద్వారా చేసిన పోరాటానికి, తెచ్చిన మార్పుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు" అనే అస్త్రం వదలగా, సాంకేతికంగా, చట్టపరంగా సాధ్యం కాకపోయినా, రాజకీయంగా మాత్రం నేతల మైండ్ సెట్ మార్చేసిందని ఫలితాలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మిగతా 2లో

## నెట్ జీరో సిటీగా హైదరాబాద్

- గ్రీన్ ఎనర్జీకి తెలంగాణ ప్రాధాన్యం
- ముంబై క్లైమేట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

2లో

# పెద్దల సభకు ఎవరు?

### తెలంగాణ నుండి రెండు ఖాళీలు

### రేసులో వేం నరేందర్ రెడ్డి, మధుయాష్కీ, వీహెచ్

**హైదరాబాద్, మహా :** రాజ్యసభలో ఖాళీ అవుతున్న సీట్లకు సంబంధించి బుధవారం ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు సంబంధించిన రెండు రాజ్యసభ స్థానాల భర్తీ ప్రక్రియ అధికార కాంగ్రెస్ పార్టీలో సెగలు పుట్టిస్తోంది. పార్టీలో ఏ పదవిలో లేకుండా ఉన్న సీనియర్ నాయకుల కళ్లన్నీ రాజ్యసభ సీటు మీదనే. ముఖ్యంగా వాటిలో ఒకదానిని జాతీయ నాయకత్వానికి కేటాయించడం ఖాయం కాగా, మిగిలిన స్థానం కోసం రాష్ట్ర స్థాయి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. గాంధీ భవన్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ రేసులో ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. ఇప్పటికే వారికి ఉన్న లింక్స్‌లో హైకమాండ్ దగ్గర సిఫార్సులు స్టార్ట్ చేశారు. పెద్దల సభకు రాష్ట్రంలో గట్టిగానే పోటీ ఉంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సహా మంత్రులంతా ఢిల్లీలోనే ఉన్నారు. గురువారం జరిగే సమావేశంలో దీనిపై అధిష్టానం చర్చించే అవకాశముంది.

**సింఘ్వీకి రెన్యువల్**

కాంగ్రెస్ అధిష్టానానికి అత్యంత సన్నిహితుడు, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి మరోసారి రాజ్యసభ అవకాశం ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ కోటా నుండే ఆయన పేరును ఖరారు చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్యేల కేసుతో పాటు తెలంగాణకు సంబంధించిన అనేక కేసులను ఆయన వాదిస్తున్నారు.

**ఒక్క స్థానం.. ఆరుగురు హేమాహేమీలు**

మరో స్థానం కోసం ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారిలో ప్రధానంగా వినిపిస్తున్న పేర్లు ఇవే:

**సుదర్శన్ రెడ్డి:**

ఇటీవల 'ఇండియా' కూటమి తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేసిన సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన అనుభవం పార్టీకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. న్యాయపరమైన అంశాల్లో కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు.

మిగతా 2లో



# బాల్క సుమన్ అరెస్టు..

### ఆదిలాబాద్ జైలుకు తరలింపు

### నేడు ఆదిలాబాద్ జైలుకు హరీష్.. సుమన్, హరీష్ లపై మంత్రి వివేక్ ఫైర్



**ఆదిలాబాద్, మహా :** మంత్రి వివేక్ కారుపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నేత బాల్క సుమన్ కు 14 రోజుల రిమాండ్ విధించింది మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు. ఈ కేసులో ఏ1గా బాల్క సుమన్ , ఏ2గా మూల రాజిరెడ్డిని చేర్చారు. బాల్కసుమన్ తో పాటు రాజిరెడ్డిని ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక సమయంలో పోలీసులపై దాడి చేసిన కేసులో బాల్క సుమన్ ను బుధవారం అరెస్ట్ చేశారు. చైర్మన్, వైస్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు వేసేందుకు క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళుతున్న.. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేయటం..పోలీస్ సెక్యూరిటీ కోన్ విసిరేయటం వంటివి బాల్క సుమన్ చేశారు. తన అనుచరులను రెచ్చగొట్టి.. దాడి చేయించటంలో కీలక పాత్ర పోషించారు బాల్క సుమన్. ఈ దాడిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.. మరో కాంగ్రెస్ కార్యకర్త సైతం గాయపడ్డాడు.

మిగతా 2లో

## దానం నాగేందర్ ఫిరాయింపుపై విచారణ

### ఎమ్మెల్యేలు ఏలేటి, పాడి కౌశిక్ రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్

మిగతా 2లో

# ఆదిలాబాద్‌లో నవశకం


### పాతికేళ్ల తర్వాత కాంగ్రెస్ జెండా ఎగరేసిన కంది

### కలిసొచ్చే శక్తులతో కలిసి బీజేపీకి బ్రేక్.. విధేయులకు బల్దియా పీఠం



**ఆదిలాబాద్, మహా** బాగున్న పిచ్ పై ఎవరైనా బౌండరీలు కొడతారు. కానీ అనుకూలంగా లేని పిచ్ పై అంచనాలు పటాపంచలు చేసి విజయం సాధించడమంటే అది మామూలు విషయం కాదు. అందుకే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని ఆ పార్టీ ప్రత్యేకంగా చూస్తోంది. అనేక పరీక్షలకు నిలిచి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాస రెడ్డి బల్దియాపీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయడంలో కీలకభూమిక పోషించారు. గత మూడేళ్ళుగా పార్టీని ఎంతోకష్టపడి నిర్మిస్తూ, ప్రతీ ఎన్నికలోనూ పార్టీని ముందువరుసలో నిలిపేందుకు సర్వధా శ్రమిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి బల్దియా పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయడంలో సఫలమయ్యారు. కాంగ్రెస్ ను గెలిపించడమే కాకుండా తనకు అత్యంత విధేయుడి కుటుంబానికి ఛైర్ పర్సన్ పదవి వచ్చేలా ఒప్పించి మెజారిటీ సాధించారు. తనకు అత్యంత సన్నిహితుడు, రెండేళ్ళగా తన ముఖ్య అనుచరుల్లో ఒకడిగా.. పార్టీ పురోగతికి కీలకంగా పనిచేస్తూ విధేయతతో, అంకితభావంతో ఉన్న బండారి సతీష్ కుటుంబానికే నియోజకవర్గంలో అతి కీలకమైన మునిసిపల్ ఛైర్ పర్సన్ పీఠాన్ని కంది కట్టబెట్టారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తనదైన రాజకీయ చాణక్యంతో.. అనుకున్నవారికే పట్టం కట్టడానికి కంది శ్రీనివాసరెడ్డి చేసిన కృషి ఫలించింది. కంది శ్రీనివాసరెడ్డి 25 స్థానాల్లో గెలిచేందుకు పక్కాగా ప్లాన్ చేసినప్పటికీ, టికెట్ల కేటాయింపు సమయంలో పోటీతత్వం, చివర్లో అనేక సమీకరణలు ముందుకొచ్చినా.. అందరినీ కలుపుకుపోయే ఉద్దేశ్యంతో మౌనంగా భరించి, అనుకున్న స్థానాలు రాకున్నా

మిగతా 3లో



మహా పత్రిక 02
తెలుగు
గురువారం, తిరుపతి | 19-02-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# గేమ్ ఛేంజర్ సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతీ రాజకీయపార్టీ బీసీలకు పెద్దపీట వేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. నాయకులు కూడా స్థానిక జనాభాను బట్టి ఏ వర్గం మెజారిటీ ఉంటే ఆ వర్గానికి టికెట్లు ఇస్తూ గెలుపుతీరం చేరాలనుకున్నాయి. చట్టం 34% దగ్గరే ఆగిపోయినా,క్షేత్రస్థాయిలో మాత్రం రికార్డు విజయాలు దక్కాయి. ఏకంగా 61శాతం ఛైర్మన్ పదవులు బీసీలకు దక్కడం తెలుగురాష్ట్రాల చరిత్రలో మునుపెన్నడూ జరగని ఓ పరిణామం.

**మహిళా ప్రభంజనం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తుండడంతో ఈసారి విద్యావంతులైన మహిళలు పెద్ద ఎత్తున పోటీకి ముందుకొచ్చారు. రిజర్వేషన్ల పరిమితిని దాటి మరో 11శాతం అదనంగా మహిళలు గెలవడం అనేది తెలంగాణ రాజకీయాల్లో ఇది సామాజిక మలుపుగా, గేమ్ ఛేంజర్ గా కనబడుతోంది. ఆర్టీసి ఉచితబస్సుతో మహిళల ప్రయాణాలు, సమావేశాలు, వేడుకల్లో హాజరుకావడాలు పెరగ్గా.. రాజకీయ మలుపులో ఇది కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. ఫ్రీబస్సు, మహిళా సంఘాలకు ప్రోత్సాహం, మహిళా సూపర్ బజార్లు, లోన్లు, ప్రతి మహిళను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ నినాదాలు, మహిళలకు పెట్రోల్ బంక్ లు, అద్దె బస్సులు ఇలా ఎన్నో కార్యక్రమాల్లో మహిళలను ముందు వరుసలో పెడుతుండడంతో రాజకీయంగా మహిళలు ముందు వరుసలోకి రావడానికి కారణమైంది. గతంలో 'మహిళా ప్రతినిధి' అంటే భర్త లేదా తండ్రి వెనుక ఉండి నడిపించే పాత్ర అనే ముద్ర ఉండేది... కానీ ఇప్పుడు సీన్ మారింది. మహిళల్లో ముందునిలవాలన్న కాంక్షను పెంచడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం సఫలమైంది. స్థానిక ప్రభుత్వాలన్నీ ఓ రకంగా మహిళల చేతికి, బీసీల చేతికి వెళ్ళాయి.

**బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనం- బీసీ కమిషన్ హర్షం**

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీలు గెలుపొందడంపై

బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# పెద్దల సభకు ఎవరు?

## తెలంగాణ నుండి రెండు ఖాళీలు.. రేసులో వేం నరేందర్ రెడ్డి, మధుయాష్కీ, వీహెచ్

(మొదటిపేజీ తరువాయి)

**వేం నరేందర్ రెడ్డి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రస్తుతం సీఎం సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి కూడా రాజ్యసభ రేసులో ఉన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఖరారవుతుందని భావించినా, పార్టీ హైకమాండ్ ఆఖరి నిమిషంలో పలు సమీకరణలు తెరమీదకు తెచ్చింది. ముఖ్యమంత్రి వరుస విజయాలతో హైకమాండ్ దగ్గర మంచి మార్కులు కొట్టేయడంతో ఈ దఫా తన సన్నిహితుడికి ఇప్పించుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

**మధుయాష్కి గౌడ్:**

రాహుల్ గాంధీ కోటరీలో సభ్యుడిగా గుర్తింపు ఉన్న మధుయాష్కి గౌడ్, బీసీ కోటాలో తన పేరును పరిశీలించాలని కోరుతున్నారు. గతంలో పీసీసీ చీఫ్ పదవికి పోటీలో ఉన్న ఆయనకు పలు అంశాలు కలిసిరాలేదు. హైకమాండ్ ఏదో ఒక రూపంలో న్యాయం చేసే ఆలోచనలో ఉంది.

**కె. కేశవరావు (కేకే):**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే సమయంలో తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కేకే, తిరిగి అదే స్థానాన్ని తనకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం.

**వి. హనుమంతరావు (వీహెచ్):**

పార్టీ విధేయుడైన సీనియర్ నేత వీహెచ్ కూడా రేసులో ఉన్నారు. అవకాశం ఇస్తే పార్లమెంటులో పార్టీ గొంతుకను వినిపిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**జీవన్ రెడ్డి :**

జగిత్యాల జీవన్ రెడ్డి పార్టీలో ప్రతిరోజూ హాట్ టాపిక్ గా ఉంటుండగా, ఏదో ఒక పదవి ఇచ్చి ఆయనను శాంతింపజేయాలన్న యోచనలో హైకమాండ్ ఉంది.

**37 ఖాళీలకు షెడ్యూల్ .. 26 నుండి నామినేషన్లు**

రాజ్యసభలో ఖాళీ అవుతున్న సీట్లకు సంబంధించి బుధవారం ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల నుంచి 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో తెలంగాణ నుంచి రెండు స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈనెల 26న ఈసీ నోటిఫికేషన్ ఇవ్వనుంది. నామినేషన్ల దాఖలకు మార్చి 5 వరకు గడువు ఉంది. ఆరున నామినేషన్ల పరిశీలన జరగ్గా ఉపసంహరణకు గడువు మార్చి 9 వరకు ఉంది. మార్చి 16న పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం ఐదుగంటలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. మొత్తం 37 రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. అందులో 20 మంది పదవీకాలం ఏప్రిల్ రెండుతో ముగియనుంది. జనవరి మొదటి వారం నుంచి ఓ సీటు ఖాళీగా ఉంది. మిగతా 16 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆయా ఖాళీలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 16న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆయా సీట్లకు ఎన్నిక పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్నికల ప్రక్రియను మార్చి 20, 2026 లోపు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇక ఖాళీ అయిన సీట్లలో మహారాష్ట్ర7, ఒడిశా3,తమిళనాడు, పశ్చిమ బెంగాల్ నుండి ఆరేసి సీట్లు, అస్సాం3, బీహార్ 4, ఛత్తీస్‌గఢ్2, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ నుండి ఒక్కొక్క సీటు, తెలంగాణ నుండి రెండు సీట్లు ఖాళీ అవుతున్నాయి. వీరిలో కేఆర్ సురేష్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ పదవీకాలం ఏప్రిల్ 9తో ముగుస్తుంది. రాజ్యసభ ఎన్నికలు ఆయా రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల ఓట్ల ద్వారా ఎన్నిక జరుగుతుంది.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌లు

## ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ.. ప్రత్యేక వెబ్ సైట్ ప్రారంభం
## ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి



**మహా, హైదరాబాద్;** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నెం.252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఓ ప్రకటనలో తెలిపారు. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రత్యేక వెబ్సైట్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పాటు డిజిటల్ మీడియా, ఫ్రీలాన్సర్స్, వెటరన్ (సీనియర్) జర్నలిస్టులు కూడా అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన వారు సమాచార శాఖ అధికారిక వెబ్సైట్ ipr.telangana.gov.in ద్వారా ఆన్లైన్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుండే ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎప్పుడైనా తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే జర్నలిస్టుల కోసం 9154170881 ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్ ను కేటాయించారు. కార్యాలయ పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగం ప్రతినిధులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆమె జర్నలిస్టులకు సూచించారు.

# బాల్క సుమన్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

క్యాతనపల్లిలో జరిగిన గొడవపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో బాల్క సుమన్ ను పోలీసులు ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు.

**హరీష్ రావు, సుమన్ లపై మంత్రి వివేక్ ఫైర్**

బాల్క సుమన్ అరెస్టను మాజీ మంత్రి హరీష్‌రావు ఖండించడంపై మంత్రి వివేక్ ఫైర్ అయ్యారు. క్యాతనపల్లిలో సుమన్ చేసిన గొడవ కనిపించడం లేదా అని హరీష్‌రావును ప్రశ్నించారు. ఒక ఎంపీ, మంత్రి వెహికల్స్‌పై రాళ్ళతో దాడి చేస్తారా..? మంత్రి కాన్వాయ్ పై దాడి చేసిన వ్యక్తికి ఎలా సపోర్ట్ చేస్తారని హరీష్ రావును నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా హరీష్‌రావు కూడా క్యాతనపల్లి వచ్చి ప్రచారం చేశారని.. కానీ మేం ఎవరినీ అడ్డుకోలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయలేదని తెలిపారు. అదే బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌ను అర్ధరాత్రి అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో అసలు గొడవనే లేదని.. బాల్క సుమన్ కావాలని గొడవ క్రియేట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఓటు వేసేందు వెళ్తుంటే సుమన్ మా వెహికల్‌పై రాళ్ళు రువ్వారని అన్నారు. బీఆర్ఎస్ వాళ్లను పోలీసులు ఎక్కడ అడ్డుకోలేదు.. మామీద అనవసరంగా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా మీద రాళ్ళు ఎందుకు విసిరారో చెప్పాలని బీఆర్ఎస్ వాళ్లు చెప్పాలని డిమాండ్ చేశారు.

# అమెరికా-భారత్ మధ్య సబ్‌సీ కేబుల్ రూట్

## లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు.. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్.. అదానీ ఏఐతో చేతులు కలిపిన గూగుల్

**ఢిల్లీ, మహా:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ అసాధారణ రీతిలో ముందుకు సాగుతోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు. భారత ఏఐ పరివర్తనలో భాగస్వామ్యం అయ్యేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐ హబ్‌ను గుర్తుచేసిన ఆయన, తాజాగా అమెరికాభారత్ పేరిట కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. అమెరికా, భారత్, దక్షిణ గోళార్ధంలోని పలు ప్రాంతాల మధ్య ఏఐ కనెక్టివిటీని మెరుగుపర్చడానికి కొత్త సబ్‌సీ కేబుల్ రూట్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మరోవైపు ఏఐ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నట్లు వివరించిన సుందర్ పిచాయ్, ఆరోగ్య సంరక్షణ డయాగ్నస్టిక్స్‌ను మెరుగుపర్చడం నుంచి రైతులకు రియల్‌టైమ్ అలర్ట్‌లు అందించడం వరకు అనేక సమస్యలను పరిష్కరించవచ్చని వివరించారు. భారతదేశ వైవిధ్యం, భాషా వ్యవస్థ, బలమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నూతన ఆవిష్కరణలకు శక్తిమంతమైన పునాది అని పేర్కొన్నారు. ఏఐ వినియోగంలో విశ్వాసం, భద్రత, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సుందర్ పిచాయ్ సూచించారు. సాంకేతికత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, ఫలితాల ఆధారంగా ఉన్నప్పుడు ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. "పర్సనల్ ఏఐ అసిస్టెంట్ జెమినై యాప్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో భారత్ మా అతిపెద్ద మార్కెట్లలో ఒకటి.



భారత్‌లో మాట్లాడే పది భాషల్లో ఇది అందుబాటులో ఉంది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గత ఏడాది 15బిలియన్ డాలర్లతో విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాం. ఇది గిగావాట్ స్థాయిలో ఏర్పాటవుతుంది. సరికొత్త ప్రపంచస్థాయి సముద్ర కేబుల్ గేట్‌గా మారుతుంది. కటింగ్ ఎడ్జ్ ఏఐ ద్వారా ఉద్యోగాలు వస్తాయి. భారత్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు, వ్యాపారవేత్తలకు సేవలు అందుతాయి" అని సుందర్ పిచాయ్ తెలిపారు.

**అమెరికా-భారత్ మధ్య సముద్ర కేబుల్**

"ఇవాళ కొత్తగా భారత్‌అమెరికా అనుసంధాన ప్రక్రియను ప్రకటిస్తున్నాం. దీని ద్వారా సరికొత్త సముద్ర కేబుల్స్ వస్తాయి. అమెరికాభారత్ మధ్య ఏఐ అనుసంధానం మరింత పెరుగుతుంది. దక్షిణార్ధగోళంలోని అనేక ప్రాంతాల్లో ఈ కేబుల్స్ వస్తాయి. ఈ మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా యువతలో నైపుణ్యాలు పెంచేందుకు పెట్టుబడులు పెడతాం. ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమమని స్పష్టంగా చెబుతున్నాను. ఎందుకంటే యువత, ఉద్యోగులు తమ పనుల్లో ఏఐని పెద్దఎత్తున ఉపయోగించుకునేలా సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తాం. భారత్‌లో ఈ సేవల కోసం అదానీ ఏఐతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నాం. ఈ సేవలను మొదట ఆంగ్లం, హిందీలో అందుబాటులోకి తెస్తాం. తర్వాత మిగతా భాషల్లోనూ ప్రవేశపెడతాం. ఇది గిగావాట్ స్థాయి కంప్యూట్, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుంది. దీనివల్ల ఉద్యోగాలు, అధునాతన ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దేశానికి వస్తాయి" అని సుందర్ పిచాయ్ చెప్పారు.

# నెట్ జీరో సిటీగా హైదరాబాద్

## గ్రీన్ ఎనర్జీ కి తెలంగాణ ప్రాధాన్యం.. ముంబై క్లైమేట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



శక్తివంతమైన దేశంగా భారత్

**ముంబై, మహా :** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో గ్రీన్‌ఎనర్జీని ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈవీల తయారీ కోసం చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు.

**పట్టణాభివృద్ధికి కంకణం**

పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి IIT, IIM, IISC వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు.

దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (LPG) సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్‌వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

**కొవిడ్ తర్వాత మారిన ప్రభుత్వాల దృష్టికోణం**

కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి (Revanth Reddy) స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్E జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ గా ప్రకటించగా, ఓఆర్ఆర్, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి “చైనా +1” ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

**గ్రీన్ సోర్సుల నుంచి తెలంగాణకు విద్యుత్**

తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ఓఆర్ ఆర్ , ట్రిపుల్ ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**తెలంగాణలో ఈవీల తయారీకి ఏర్పాట్లు**

తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని చెప్పారు. హైదరాబాద్ CURE ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా EVల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే EV తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# దానం నాగేందర్ ఫిరాయింపుపై విచారణ

## ఎమ్మెల్యేలు ఏలేటి, పాడి కౌశిక్ రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్

**హైదరాబాద్, మహా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన ఫిర్యాదుల విషయంలో అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లకు సంబంధించి స్పీకర్ విచారణ జరిపారు. ఎమ్మెల్యే తరపున హాజరైన న్యాయవాదులు పిటిషనర్లుగా ఉన్న ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలను ఐదు గంటలకు పైగా క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఎందుకు అనర్హత వేటు వేయాల్సి ఉంటుందో లీగల్‌గా, టెక్నికల్ కోణంలో పిటిషన్లలో లేవనెత్తిన అంశాలపై లాయర్లు ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ విచారణ దశలో ఉన్నందున బీఆర్ఎస్ తరపున దాఖలు చేసిన అఫిడవిట్‌లోని అంశాలు కూడా ఈ క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి.

**'దానం' రిప్లై కీలకం**

బీఆర్ఎస్ టికెట్ మీద ఎమ్మెల్యేగా ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్ ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫామ్ మీద సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీ చేశారన్నది పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ప్రధాన ఆరోపణ. దీన్ని ఆధారంగా చేసుకుని ఆయనపై అనర్హత వేటు వేయాలని పిటిషన్‌లో స్పీకర్‌ను కోరారు. ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయింపు చేశారనడానికి ఈ అంశం కీలక ఆధారమని విచారణ సందర్భంగా దానం నాగేందర్ తరఫు న్యాయవాదులకు వివరించారు. పాడి కౌశిక్‌రెడ్డిని ఈ నెల 4వ తేదీనే క్రాస్ ఎగ్జామిన్ చేసే ప్రక్రియ పూర్తయింది. మరోసారి బుధవారం సైతం దానం నాగేందర్ తరఫు లాయర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై స్వయంగా దానం నాగేందర్‌ను స్పీకర్ విచారించి ఆయన ఇచ్చే సమాధానాలకు అనుగుణంగా అనర్హతపై నిర్ణయం తీసుకోనున్నారు.

**'దానం'ను బీఆర్ఎస్ ఎందుకు సస్పెండ్ చేయలేదు?**

దానం నాగేందర్‌ను బీఆర్ఎస్ సస్పెండ్ చేసిన విషయం కూడా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని లాయర్లు క్రాస్ ఎగ్జామిన్ చేసే సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణలో బీఆర్ఎస్ తరఫున దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ అంశాన్ని పొందుపరిచిన సంగతి తెలుసా అంటూ న్యాయవాదుల ప్రశ్నించారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియాకు వివరించారు. అఫిడవిట్ దాఖలు చేసి నెలలు గడుస్తున్నా ఈ విషయాన్ని బీఆర్ఎస్ బహిర్గతం చేయలేదని గుర్తుచేశారు. నిజంగా అఫిడవిట్‌లో ఈ అంశాన్ని బీఆర్ఎస్ పేర్కొన్నట్లయితే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడే అవకాశమే లేదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత ఏ పార్టీలో చేరినా అది సంబంధం లేని అంశం అవుతుందని, అనర్హత వేటు వేయాలన్న డిమాండ్ అర్థరహితమవుతుందన్నది ఏలేటి వాదన. లాయర్లు ప్రస్తావించినట్లుగా బీఆర్ఎస్ అఫిడవిట్‌లో దానం నాగేందర్‌ను సస్పెండ్ చేసిన అంశం ఉన్నదీ లేనిది ఆసక్తికరంగా మారింది. దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారనడానికి ఉన్న ఆధారాలపైనా లాయర్లు ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఇబ్రహీంపట్నం ట్విస్ట్ లు

- స్టే ఎత్తివేసిన హైకోర్టు.. ఎన్నిక బాధ్యత కలెక్టర్ దే
- ఖానాపూర్ లో మరో ట్విస్ట్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఖానాపూర్:** ఇబ్రహీంపట్నం కౌన్సిలర్ ఆకుల యాదగిరిని పోలీసులు, బుధవారం హైకోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరచడంతో, అతని వాంగ్మూలం తీసుకున్న హై కోర్ట్. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వివాదంపై హైకోర్టులో విచారణ ముగిసిన అనంతరం ఛైర్మన్ ఎన్నికపై స్టే ఎత్తివేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. ఎన్నిక బాధ్యత ఆర్వోదేనని తేల్చి చెప్పింది. మరోవైపు ఖానాపూర్ ఎన్నిక కోరం లేక వాయిదాపడగా, దీనిపై ఆర్ వో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎవరో ఒకరం ఛైర్మన్ పదవి తీసుకుందామని బీజేపీ నేతలు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు
# తిరుగులేదు

94 మునిసిపాలిటీల్లో విజయం సాధించాం

మరో రెండు పర్యాయాలు మాదే అధికారం

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)

సీట్ల కేటాయింపు పూర్తిగా సర్వేల ఆధారంగా, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్ల పనితీరును బట్టే ఉంటుందని సీనియర్ నేత జీవన్ రెడ్డికి సూచించారు. పాలనపై ప్రజామోదంరాష్ట్రంలోని 94 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఇస్తున్న మద్దతుకు నిదర్శనమని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యంగా నిజామాబాద్‌లో ఐదు సీట్లలో ఎంఐఎం అభ్యర్థులపై గెలవడం విశేషమని, మేయర్ పదవి దక్కితే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్న కార్పొరేటర్ల ఆలోచనను ఆయన స్వాగతించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
సినిమా వార్తలు | MOVIE NEWS
గురువారం, తిరుపతి | 19-02-2026
ANN తెలుగు

# సైకాలజికల్ థ్రిల్లర్‌తో వస్తున్న అనుపమ

వరుస విజయాలతో దూసుకుపోతున్న మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ తన పుట్టినరోజు(ఫిబ్రవరి 18) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. పాన్-ఇండియా రేంజ్‌లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న అనుపమ, ఇప్పుడు ఒక ఇంటెన్స్ సైకాలజికల్ థ్రిల్లర్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో అనుపమ పరమేశ్వరన్, దర్శకుడు ఆర్జే షాన్ కాంబినేషన్‌లో వచ్చిన ఒక షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు అదే హిట్ జోడీ వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది. వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ఫీచర్ ఫిల్మ్‌పై అప్పడే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ లెవల్‌లో రుస్తుం, ప్యాడ్ మ్యాన్, టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ మరియు ఎస్ కే గీ (Ess Kay Gee) ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034